కేసీఆర్‌ను విమర్శించడం మానుకోవాలి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 7 : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విమర్శలు చేయడం సీఎం రేవంత్‌రెడ్డి మానుకోవాలని హిమాయత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ నేత అనీష్ గంగపుత్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, గత పదేండ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు అందించి, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయకుండా తొలి సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే కేసీఆర్‌పైకు క్షమాపణ చెప్పాలని కోరారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మా, వైస్ చైర్మన్ గోపాల్ తదితరులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 7: అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 13, 14, 23 వార్డుల్లో జరుగుతున్న డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలన్నారు. పనులు పరిశీలించిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

ప్రభుత్వ పాఠశాల నూతన తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 7: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలిపురం జిల్లా పరిషత్ పాఠశాలలో వి-డ్రీమ్, నిర్మాణ్ సంస్థల సౌజన్యంతో రూ.36లక్షలు వెచ్చించి అదనపు తరగతి గదులు, ప్రహరీని నిర్మించారు. బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై నూతనంగా నిర్మించిన తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ సంస్థలు ముందుకు వచ్చి పేద విద్యార్థులు చదువుకునేందుకు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యార్థులకు ఉత్తమ విద్యాబుద్ధులు నేర్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా విని నేర్చుకోవాలన్నారు. ఏమైనా పాఠాలు అర్థంకాకపోతే అప్పుడు నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులే ఎక్కువగా విద్యాభ్యాసం నేర్చుకుంటున్నారన్నారు. విద్యార్థులు బాగా చదువుకుంటేనే భవిష్యత్తు బాగుంటుందన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తున్నానన్నారు. విద్యార్థులకు ఎక్కడ ఎలాంటి సమస్యలు ఏర్పడినా తన దృష్టికి తీసుకువస్తే వాటికి పరిష్కారాలు చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వి-డ్రీమ్ ప్రతినిధి కిమ్యను, నిర్మాణ్ సంస్థ ప్రతినిధి అనురాధ, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ప్రేమ్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలు పరిశీలించిన కలెక్టర్

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వెటర్నరీ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎంలను బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక వివిధ పార్టీ నాయకుల సమక్షంలో పరిశీలించారు. ఈవీఎంల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, నాయకులు వై.శ్రీధర్, కోరని బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

– బండ్లగూడ, ఫిబ్రవరి 7

కార్మికుల నడుమ కలమడుగు పుట్టినరోజు



సిటీబ్యూరో, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ) : తెలంగాణ స్వచ్ఛ ఆటో టిప్పర్ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కలమడుగు రాజేందర్ పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛ ఆటో టిప్పర్ కార్మిక సంఘం జీహెచ్ఎంసీ అధ్యక్షుడు కాట్రావత్ గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆటో టిప్పర్ కార్మికులు, అభిమానులు, కుటుంబ సభ్యుల నడుమ రాజేందర్ జన్మదిన వేడుకలు జరిగాయి. యూనియన్ నాయకులు పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హంసరాజు, కందుల అర్జున్, జీమకల శేఖర్, పరుశరాం, వెంకటేశ్, బాలు, మచ్చగిరి, రేణుకుమార్, మహానంది, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలు గుర్తించి అభివృద్ధి చేస్తున్నాం



గగన్‌పహాడ్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 7: ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం గగన్‌పహాడ్‌లో నూతన డ్రైనేజీ పైప్‌లైన్‌ల నిర్మాణం కోసం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొంత కాలంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా శిథిలావస్థకు చేరిందన్నారు. దీంతో మురుగునీరు రోడ్లపై పొంగిపొర్లుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మిస్తే ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. అధికారులతో చర్చించి త్వరలోనే పనులను ప్రారంభించి సమస్యకు శాశ్వత పరిష్కారాలు చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జోగి రవి, తలారి చిన్న, తిరుపతిరెడ్డి, వినయ్‌రెడ్డి, వల్లూరి శ్రీను, అడికే జనార్దన్, శేఖర్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

కేసు వెనక్కి తీసుకోకుంటే చంపేస్తా..

భార్యను, కొడుకును బెదిరిస్తున్న వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్,ఫిబ్రవరి 7: తనపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోకుంటే అంతు చూస్తానంటూ భార్యతోపాటు కొడుకును కత్తితో బెదిరించిన వ్యక్తిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడ సమీపంలోని ఎల్ఎన్‌నగర్‌లో నివాసముంటున్న విజయమ్మకు 24 ఏళ్ల కిందట రామచంద్రయ్యతో పెండ్లి అయ్యింది. వీరికి ఇద్దరు సంతానం. 10 నెలల కిందట భార్య విజయమ్మతో గొడవపడి, కర్రతో దాడి చేయడంతో రామచంద్రయ్యపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఆ కేసులో అరెస్టయిన రామచంద్రయ్య.. రెండు నెలల తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చి భార్యతో పాటే ఉంటున్నాడు. కొన్ని రోజులుగా అతడు.. తనపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలంటూ ఒత్తిడి చేస్తున్నాడు. కేసును వెనక్కి తీసుకోకుంటే తన వద్ద ఉన్న కత్తిని చూపిస్తూ చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడు. ఆమె ఊర్లో లేనప్పుడు కత్తిని చూపించి కొడుకును కూడా బెదిరించాడు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఐపీసీ 195(ఏ), 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం నిందితుడు రామచంద్రయ్యను అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

ఎంఎస్ఎంఈ లోన్ మేళాకు విశేష స్పందన

లోన్ మేళాలో ఎంఎస్ఎంఈలతో మాట్లాడుతున్న బ్యాంకర్లు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 7:చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు యూసుఫ్‌గూడలోని నిమ్స్‌మే క్యాంపస్‌లో బుధవారం నిర్వహించిన లోన్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈలకు లోన్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో ప్రముఖ ప్రభుత్వ రంగ, ప్రైవేట్ బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలు స్టాల్‌లను ఏర్పాటు చేశారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రాజెక్ట్ నివేదికల తయారీ, రుణం పొందే ప్రక్రియ, అవసరమైన పత్రాలపై ఎంఎస్ఎంఈలకు అవగాహన కల్పించారు. నగర నలుమూలల నుంచి 163 ఎంఎస్ఎంఈల ప్రతినిధులు హాజరై తమ ఆర్థిక ఉత్పత్తులు, ప్రత్యేక సేవా ఆఫర్లు, రుణాల కోసం దరఖాస్తులపై ఆయా బ్యాంకర్‌లతో చర్చించారు. ఈ కార్యక్రమంలో నిమ్స్‌మే ఫ్యాకల్టీలు డిబ్యేందు చౌదరి, స్వప్న, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

బండ్లగూడ, ఫిబ్రవరి 7 : ప్రభుత్వాలు అందించే రుణాలను వ్యాపారులందరూ సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ యూసీడీ అధికారి రాధారాణి పేర్కొన్నారు. ఆమె రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని విధి వ్యాపారులకు ప్రభుత్వం తరపున సుమారుగా 50 మందికి వివిధ బ్యాంకుల ద్వారా రూ.10వేల నుంచి రూ.50వేల వరకు రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వయం ఉపాధితో జీవనం సాగించే వారికి ఇలాంటి రుణాలు ఎంతో సహాయ పడుతాయన్నారు. రుణాలు కావాల్సిన వారు తమను సంప్రదిస్తే అందుకు కావాల్సిన పత్రాల గురించి వివరించడంతో పాటు రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వీధి వ్యాపారులకు రుణాలను అందజేస్తున్న జీహెచ్ ఎంసీ యూసీడీ అధికారి

మినీయేచర్ ఆర్టిస్టు డాక్టర్ దయాకర్‌కు సత్కారం

దయాకర్‌ను సత్కరిస్తున్న సినీ నటుడు బాబూమోహన్ తదితరులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 7: ధాన్యపు గింజలతో అతను అద్భుత కళాఖండాలను సృష్టిస్తారు. తెలంగాణ తల్లి, చార్మినార్ లాంటి అనేక కళారూపాలను తయారు చేశారు. ప్రస్తుతం అయోధ్య శ్రీరామమందిరం నమూనాను గింజలతో రూపొందించి కొత్త రికార్డును నెలకొల్పారు మినీయేచర్ ఆర్టిస్టు డాక్టర్ గుర్రం దయాకర్. 16,200 బియ్యం, చిరు ధాన్యాలతో రామమందిర నమూనాను తయారు చేశారు. ఆయన ప్రతిభను గుర్తిస్తూ టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్స్, భారత్ వరల్డ్ రికార్డ్స్, యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు కల్పించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జై జవాన్, జైకిసాన్, జై కళాకార్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సినీ నటుడు బాబూమోహన్, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, జాతీయ, అంతర్జాతీయ వరల్డ్ రికార్డ్స్ ఆర్గనైజేషన్స్ కోఆర్డినేటర్ లయన్ డాక్టర్ కేవీ రమణారావు, వరల్డ్ రికార్డ్స్ అడ్వయిజరీ కమిటీ ఉపాధ్యక్షురాలు, మేమ సైతం యువ సేన ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు చకిలం స్వప్న శ్రీనివాస్‌తో కలిసి శాలువా, పూలబొకేతో ఘనంగా సత్కరించారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 7 : ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి అన్నారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎస్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం చెంది ప్రైవేట్ రంగం విస్తరించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాల వల్ల యువతకు ఉపాధి అవకాశాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల పరం చేస్తుందని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనంతోపాటు కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

టాటానగర్‌లో అగ్ని ప్రమాదం

టాటానగర్‌లోని గోదాంలో ఎగిసిపడుతున్న మంటలు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 7: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని టాటానగర్‌లో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. వివరాల ప్రకారం.. నగరానికి చెందిన మహ్మద్ అస్లాం టాటా నగర్‌లో సోఫాలకు సంబంధించిన రామెటీరియల్స్ గోదాంను నిర్వహిస్తున్నాడు. ఈ గోదాం పక్కనే ఓపెన్‌ప్లాట్ ఉండటంతో అక్కడ చెత్తచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను డంప్ చేస్తుంటారు. ప్రతిరోజు మాదిరిగానే రాత్రి సమయంలో గోదాంను మూసివేసి యజమానితో పాటు కార్మికులు ఇండ్లకు వెళ్లిపోయారు. రాత్రి 11గంటల సమయంలో ప్రమాదవశాత్తు గోదాంకు మంటలు అంటుకోని దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. దీంతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. రంగారెడ్డి జిల్లా ఫైర్ ఆఫీసర్ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో నాలుగు అగ్నిమాపక కేంద్రాలను సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. గోదామ్ యజమాని మహ్మద్ అస్లాం బోరున విలపించాడు. గోదాములో సోఫాలకు సంబంధించిన రామెటీరియల్‌తో పాటు ఎలక్ట్రికల్ స్తంభాల వైర్లను భద్రపరిచామన్నారు. సామగ్రీ అంతా అగ్నికి ఆహుతైందని, లక్షల రూపాయల ఆస్తినష్టం వాటిల్లిందని రోదించాడు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు నమోదు కాలేదని పోలీసులు వెల్లడించారు.

పార్క్ చేసిన యాక్టివా బైక్ మాయం

బంజారాహిల్స్,ఫిబ్రవరి 7: షాపు ముందు పార్క్ చేసిన బైక్ మాయమైన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గుడిమల్కాపూర్‌కు చెందిన సూర్యబన్ సౌరవ్ అనే యువకుడు జూబ్లీహిల్స్ రోడ్ నం.44లోని అర్బన్ నేరేటివ్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 6న ఉదయం డ్యూటీకి వచ్చిన సౌరవ్ తన యాక్టివా బైక్ (ఏపీ 13ఏఈ 1630)ను షాప్ ముందు పార్క్ చేశాడు. సాయంత్రం డ్యూటీ ముగించుకుని బయటకు వచ్చి చూడగా.. పార్క్ చేసిన యాక్టివా వాహనం కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా లాభంలేకపోవడంతో బుధవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అమ్మవారి దేవాలయంలో చోరీ

బండ్లగూడ,ఫిబ్రవరి 7 : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి పిల్లర్ నంబర్ 283 వద్ద ఉన్న అమ్మవారి గుడిలో దొంగలు పడి అమ్మవారం ఆభరణాలతో పాటు హుండీలోని నగదును ఎత్తుకెళ్లారు. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ పూజారి రాత్రి గుడి తలుపులు మూసి వేసి వెళ్లిపోయారు. రాత్రి గుడి తాళాలు పగుల కొట్టి అమ్మవారి మెడ లోంచి బంగారు ఆభరణాలతోపాటు నగదును ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం పూజారి పూజ చేసేందుకు వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో దొంగతనం జరిగినట్లు గ్రహించి స్థానికులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చోరీ.. కేసు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 7: ఉద్యోగంలో చేరిన నాలుగు రోజులకే నగదును తస్కరించిన యువకుడిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని బోళానగర్‌కు చెందిన సయ్యద్ ఇర్ఫాన్ ఈనెల 2న జూబ్లీహిల్స్ రోడ్ నం. 36లోని మాన్యవర్ స్టోర్‌లో క్యాషియర్‌గా చేరాడు. ఈనెల 5న సాయంత్రం క్యాష్ కౌంటర్‌లో నగదును లెక్కించగా రూ. 60వేలు తక్కువగా ఉన్నట్లు స్టోర్ మేనేజర్ బాలకృష్ణ గుర్తించాడు. దీంతో స్టోర్‌లోని సీసీ పుటేజీని పరిశీలించగా.. క్యాష్ కౌంటర్‌లో నుంచి కొత్తగా చేరిన ఇర్ఫాన్ నగదు తస్కరించినట్లు తేలింది. దీంతో అతడిని ప్రశ్నించగా.. తనకు ఎలాంటి సంబంధంలేదని బుకాయించాడు. స్టోర్ మేనేజర్ బాలకృష్ణ బుధవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఐపీసీ 381 సెక్షన్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

ఏబీవీపీ హైదరాబాద్ నగర కార్యదర్శి శ్రీకాంత్

శంషాబాద్ పట్టణంలో ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 7 : రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.5300 కోట్ల ఫీజ్ రియింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ హైదరాబాద్ నగర కార్యదర్శి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం శంషాబాద్ పట్టణంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నగర కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ..అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.5300 కోట్ల ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ విబాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్, జిల్లా కన్వీనర్‌మహేశ్, ప్రదీప్, అఖిల్, శ్రీకాంత్, చందులతోపాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం నాయకులు పోలీసులు అరెస్టు చేశారు.

ఘనంగా రమాబాయి జయంతి



బోరబండ డివిజన్ ఎస్ఆర్‌టీ నగర్‌లో అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ బోరబండ డివిజన్ అధ్యక్షులు పవనం శివశంకర్ ఆధ్వర్యంలో మాతా రమాబాయి అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జై భీమ్ యాదగిరి, బోరబండ డివిజన్ జనరల్ సెక్రటరీ గోపాసు దశరథ్, నాయకులు లక్ష్మణమూర్తి, అబ్బాస్, తులసీరాం, కాశీరాం, శంకర్, ఓబుల్ రెడ్డి, నారాయణ రెడ్డి, పద్మ, సునీత, కౌసల్య, అలివేల సావిత్రి పాల్గొన్నారు.

– ఎర్రగడ్డ, ఫిబ్రవరి 7

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వెంగళరావునగర్, ఫిబ్రవరి 7 : కల్లు తాగిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థిలో మృతి చెందిన సంఘటన ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వేపులపాడు, తాటిగుమ్మి గ్రామానికి చెందిన పి.జయరాజ్(30) జీవనోపాధి నిమిత్తం నగరానికి వచ్చాడు. ఎస్ఆర్ నగర్ సమీపంలోని బీకేగూడలో నివాసం ఉంటే రోజు కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మద్యం, కల్లు తాగే అలవాటున్న జయరాజ్ మంగళవారం రాత్రి సనత్‌నగర్ స్వామి కాంప్లెక్స్ సమీపంలో కల్లు తాగాడు. సమీపంలో ఉన్న పాన్‌షాప్ ముందు పడిపోయి అక్కడే మృతి చెందాడు. పాన్ షాప్ నిర్వాహకుడు భయపడి జయరాజ్ మృతదేహాన్ని సమీపంలోని కల్లు కాంపౌండ్ ముందుకు తీసుకెళ్లి అక్కడ ఉంచాడు. బుధవారం ఉదయాన్నే మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 7: ప్రధాని మోదీ చేపడుతున్న వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఈనెల 16వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మె గ్రామీణ బంద్ నిర్వహిస్తున్నామని, కార్మికులంతా విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ అన్నారు. బుధవారం కాటేదాన్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జెండ్ ఫ్లాట్ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు అధ్యక్షత వహించగా.. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్, ఏఐటీయూసీ కార్యదర్శి ఓరుగంటి యాదయ్య, ఐఎఫ్‌టీయూ యాదయ్య, టీఆర్ఎస్‌కేవీ కె.చెన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం మతతత్వ విధానాలు మానుకోవాలన్నారు. దేశ వ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కార్మిక, ఉద్యోగ, రైతు వ్యవసాయ కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన కేసులో ఇద్దరి అరెస్ట్

బండ్లగూడ, ఫిబ్రవరి 7:రాజేంద్రనగర్ జనచేతన్య హౌసింగ్ సొసైటీలో తన ప్లాటు ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి విక్రయించేందుకు యత్నిస్తున్నారని ప్లాటు యజమాని చెరుకూరి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. వివరాలిలా ఉన్నాయి. రాజేంద్రనగర్ బుద్వేల్ జనచేతన్య హౌసింగ్ సొసైటీ ఉన్న తమ స్థలాన్ని(400 గజాలు) గుర్తు తెలియని వ్యక్తులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి విక్రయించేందుకు యత్నించారు. ఈ విషయాన్ని రాజేంద్రనగర్ సబ్‌రిజిస్ట్రార్ అసలు యజమాని శ్రీనివాస్ ఇంటికి విషయం తెలుపుతూ నోటీసులు పంపింది. అమెరికాలో ఉన్న శ్రీనివాస్‌రావు హైదరాబాద్ చేరుకుని సబ్‌రిజిస్ట్రార్ వద్ద విషయం తెలుసుకున్నారు. అనంతరం రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు విశ్వనీయ సమాచారం.

IN THE COURT OF THE HONOURABLE IX ADDITIONAL DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT AT : L.B. NAGAR
O.S.No. 889 OF 2022

Between:
M/s Maple Leaf Projects, A registered Partnership Firm Rep. by its Managing Partner Mr. P. Sashikanth. ...Plaintiff
AND
Smt. Lacha Gari Surekha and others ...Defendants

NOTICE

1. K.Srinivas Rao, S/o. Subbaiah, Aged about 55 Yrs., Occ: Business, R/o. IC 25, Yerramanjil Colony, Somajiguda, Hyderabad-82 **(Defendant No. 5).**
2. Rajesh Agarwal, S/o. Radheshyam Agarwal, Aged about 50 Yrs., Occ: Business, R/o. H.No. 5-3-490, Old Tophkhana Road, Opp: Osmangunj, Hyd-12 **(Defendant No. 10).**

Sir,
Take notice that the Plaintiff herein filed suit for Declaration of Title and Consequential Declaration against the Defendants herein. The Hon'ble Court was p